సాక్షి
సంగారెడ్డి
గురువారం । 17 । ఏప్రిల్ । 2025



మొగులు గుబులు
ఆకాశంలోమబ్బుల్ని చూసి రైతులగుండెల్లో గుబులు పుడుతోంది.
వివరాలు 8లో ▸



ఉచిత కరెంట్‌తో ఇటుకబట్టీలు
ఉచిత విద్యుత్ అక్రమ ఇటుక బట్టీ వ్యాపారులకు వరంగా మారింది.
వివరాలు 8లో ▸



నిధులు మంజూరై మూడేళ్లు
జహీరాబాద్ నియోజకవర్గంలో రోడ్లకు నిధులు మంజూరైనా నిర్మాణానికి నోచుకోలేదు.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్: రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేట పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతా మాట్లాడుతూ..రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం సగం మందికి చేసి చేతులు దులుపుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వరి ధాన్యానికి మద్దతుధరతోపాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామన్నారని, దొడ్డు రకం ధాన్యానికి కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పట్నం మాణిక్యం, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నారాయణఖేడ్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 17న గురువారం సత్యసాయి మందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి బాధ్యులు తెలిపారు. శిబిరంలో కంటి సమస్యలున్న వారికి ఉచితంగా చికిత్సతోపాటు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని వెల్లడించారు. పూర్తి వివరాలకు 9676171527 నంబరులో సంప్రదించాలని సూచించారు.

28 నుంచి వేసవి శిక్షణ తరగతులు

నారాయణఖేడ్: ఖేడ్ శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఈనెల 28 నుంచి వచ్చేనెల 18 వరకు సంస్కార సాధనావర్గ వేసవి శిక్షణా శిబిరం-2025 నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 5 నుంచి 15 ఏళ్ల బాలబాలికలకు చిత్రలేఖనం, రంగులు వేయడం, సాంస్కృతిక కళలకు సంబంధించిన చెక్కభజన, యోగా, కోలాటం, డంబుల్స్, భారతీయ ఆటలు, కర్రసాముల్లో రోజూ ఉదయం 8 గంటల నుంచి 11:30 గంటల వరకు శిక్షణనిస్తారు. ఈ మేరకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూమయ్య ఓ ప్రకటనలో వెల్లడించారు. పూర్తి వివరాలకు 8099811208, 9391845885, 814322 2295 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

ట్రాన్స్‌కో సీఎండీని కలిసిన కరెంట్ కాంట్రాక్టర్లు



సీఎండీతో మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

సంగారెడ్డి: పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించడంతోపాటు తమ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ కాంట్రాక్టర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ అలీని విద్యుత్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యులు కలసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ప్రజాభిప్రాయసేకరణ



అభిప్రాయ సేకరణలో పాల్గొన్న మహిళలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఆందోళనలు 71వ రోజుకు చేరుకున్నాయి. డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై అధికారులు వారం రోజులుగా కొనసాగిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ గురువారంతో ముగియనుంది. ఈ మేరకు తహసీల్దార్ పరమేశం బుధవారం మీడియాకు వెల్లడించారు. కార్యక్రమం ముగిసేలోపు ప్రజలు స్వచ్ఛందంగా తమ అభిప్రాయాలు అందించవచ్చన్నారు. సేకరించిన అభిప్రాయాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదికల రూపంలో అందించనున్నట్లు తెలిపారు.

గూడుపురాణి

నిరుపేదలకు గూడు కల్పించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న డబుల్ బెడ్‌రూం పథకం లక్ష్యం నీరుగారుతోంది. లబ్ధిదారులకుప్రభుత్వమే నిర్మించి ఇచ్చిన డబుల్ బెడ్ రూం ఇళ్లను కొంతమంది అమ్ముకోగా... మరికొంతమంది అద్దెకిచ్చారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను అమ్మేసుకున్న లబ్ధిదారులు
- ముగ్గురిని గుర్తించిన అధికారులు
- కిరాయికి ఇచ్చిన మరికొందరు?
- చర్యలకు సిద్ధమైన యంత్రాంగం



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి మండలం ఫసల్‌వాదీలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మూడు ఇళ్లను అమ్మేసుకున్నారు. రెవెన్యూ అధికారులు చేపట్టిన విచారణలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఇలా అమ్మేసుకున్న ఇళ్లను స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. వీటిని అర్హులైన లబ్ధిదారులకు కేటాయించనున్నారు. అలాగే జిల్లాలో వివిధ చోట్ల పంపిణీ చేసిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో అసలైన లబ్ధిదారులు నివాసముండటం లేదనే విమర్శలున్నాయి. ప్రధానంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో ఈ గృహాలు పొందిన కొందరు ఇతరులకు కిరాయికి ఇచ్చినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇలా లబ్ధిదారులు నివాసం ఉండని, ఇతరులకు కిరాయికి ఇచ్చి ఇళ్లను స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ఉపక్రమించారు.

నిర్మించినా ఖాళీగానే...

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో భారీ ఎత్తున డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. ఇందులో పనులు పూర్తి కాకపోవడంతో చాలావరకు ఖాళీగానే ఉంటున్నాయి. కొన్నిచోట్ల ఈ గృహాల నిర్మాణం పూర్తయినప్పటికీ.. ఆయా నివాసాల్లో మౌలిక సదుపాయాలను కల్పించలేదు. ప్రధానంగా తాగు నీరు, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు అందుల్లో నివాసం ఉండటం లేదు. ఈ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించిన గుత్తేదారులకు సరిగ్గా బిల్లులు రాకపోవడంతో చాలాచోట్ల కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. దీంతో ఈ గృహాలు వృథాగా ఉంటున్నాయి.

జిల్లాలో 5,934 గృహాలు మంజూరు

గత ప్రభుత్వం ఈ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం విదితమే. ఇందులోభాగంగా జిల్లాలో మొత్తం 5,934 గృహాలు మంజూరుకాగా వాటిలో 4,194 గృహాల నిర్మాణం పనులు పూర్తయ్యాయి. ఇందులో 4,146 గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఈ గృహాలను అమ్ముకోవడం, అద్దెకివ్వడం గానీ చేయకుండా స్వయంగా నివాసం ఉండాలని లేని పక్షంలో వాటిని స్వాధీనం చేసుకుంటామని నిబంధనలు పెట్టారు. ఈ ఇళ్లను కేటాయించినప్పుడే మంజూరు పత్రంలో ఈ విషయాన్ని అందులో పేర్కొన్నట్లు అధికారులు చెబుతున్నారు.

త్వరలో స్వాధీనం చేసుకుంటాం

అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేసిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అమ్ముకోకూడదు. వారు నివాసం ఉండేందుకే ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు కేటాయించింది. ఇతరులకు అమ్ముకున్నట్లు తేలిన ఇళ్లను త్వరలోనే స్వాధీనం చేసుకుంటాం. ఇలా ముగ్గురు లబ్ధిదారులు అమ్ముకున్నట్లు మా విచారణలో తేలింది.
–రవీందర్‌రెడ్డి, ఆర్డీవో, సంగారెడ్డి

పోషకాహార లోపాన్ని అరికట్టాలి



గర్భవతులకు శ్రీమంతం చేస్తున్న కలెక్టర్ క్రాంతి

- శివంపేటలో పోషణ పక్షం కార్యక్రమం
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి: ఎప్పటికప్పుడు మహిళల్లోనూ, గర్భస్థ శిశువుల్లోనూ పోషకాహార లోపాన్ని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి స్పష్టం చేశారు. చౌటకూరు మండలం, శివంపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం జరిగిన పోషణ పక్షం కార్యక్రమానికి కలెక్టర్ క్రాంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ పోషకాహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆమె పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...గర్భం దాల్చిన మొదటి రోజు నుంచి రెండేళ్లవరకు మంచి పౌష్టికాహారం తీసుకుంటూ పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒత్తిడి తగ్గేందుకు వ్యాయామాలు, యోగాలు కూడా అంగన్‌వాడీ కేంద్రాల్లో నేర్పించాలని సూచించారు. ప్రతీ నెలలో రెండవ శుక్రవారం, నాలుగో శుక్రవారం తల్లికి కుటుంబ సభ్యులకు పౌష్టికాహారంపై కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఇంట్లోని వయో వృద్ధులను, తల్లిదండ్రులను భారంతో కాకుండా బాధ్యతతో చూడాలని చెప్పారు. తల్లిదండ్రుల్ని వద్దుల్ని ఇబ్బంది గురి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూ ఓ లలితకుమారి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిణి వసంతకుమారి, డీఈఓ వెంకటేశ్వర్లు, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, ఆర్డీఓ పాండు, సీడీపీఓలు, సంబంధిత అధికారులు, మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి

- విద్యుత్ సమస్య నివారణకు రూ.70లక్షలతో డెడికేటెడ్ లైన్
- అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: వేసవి తీవ్రత అధికంగా ఉండడానికి తోడు భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతుండటంతో అధికారులు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి సూచించారు. ఖేడ్ క్యాంపు కార్యాలయంలో ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రస్తుతం కొన్నిచోట్ల విద్యుత్ సమస్య ఇతర కారణాలతో నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలియడంతో మిషన్ భగీరథ పథకం ద్వారా నీటిని సక్రమంగా సరఫరా చేయించడం కోసం ప్రత్యేకంగా రూ.70 లక్షలతో డెడికేటెడ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయించామన్నారు. ఇందిరమ్మ గృహాల కోసం అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో నారాయణఖేడ్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు వినోద్‌పాటిల్, దిగంబర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పాల్గొన్నారు.

డెక్కన్ టోల్ వేస్‌కు గ్రీన్ హైవేస్-2023 అవార్డు

జహీరాబాద్: రాష్ట్ర సరిహద్దు నుంచి సంగారెడ్డి వరకు 65వ జాతీయ రహదారిని ఉత్తమంగా నిర్వహిస్తున్నందుకుగాను సంగారెడ్డికి చెందిన డెక్కన్ టోల్ వేస్ సంస్థకు గ్రీన్ హైవేస్–2023 కేటగిరీలో రజత పురస్కారం లభించింది. మంగళవారం రాత్రి ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో డెక్కన్ టోల్ వేస్‌కు చెందిన ప్రాజెక్టు హెడ్ రాజేశ్ విచారెకు కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి అవార్డును ప్రదానం చేశారు. జాతీయ రహదారి పొడుగునా పచ్చదనం నింపడం, పునరుత్పాదక ఇంధన సృష్టి, నీటి సేకరణ, వినూత్న మొక్కలు నాటడం, నీటి నిర్వహణ పద్ధతులపై చేస్తున్న కృషికిగాను డెక్కన్ టోల్ వేస్ సంస్థకు అవార్డు లభించినట్లు ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డెక్కన్ టోల్ వేస్ సంస్థ ప్రతినిధులు

వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ప్రజా సంఘాలు, దళిత నేతల డిమాండ్



పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న వివిధ సంఘాల నేతలు

సంగారెడ్డి టౌన్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వీడియోలు సృష్టించి అవమానించిన అరుణ్‌కుమార్, నాగార్జునపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిని కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాలు, దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ దేశానికి రాజ్యాంగం అందించిన గొప్ప మేధావి అంబేడ్కర్ అని అటువంటి వ్యక్తిని కించపరుస్తూ పోస్టులు పెట్టడం ఆయనను తీవ్రంగా అవమానించడమేనని మండిపడ్డారు.

తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు చేస్తే చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ హెచ్చరించారు. శివాజీ మహారాజ్ పాదాలకు అంబేడ్కర్ నమస్కరించినట్లుగా పోస్ట్‌చేసిన అరుణ్ కుమార్, నాగార్జున అనే వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

20 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

మెదక్ కలెక్టరేట్: ఈనెల 20 నుంచి మే 26వ తేదీ వరకు జిల్లాలో ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు మెదక్ జిల్లా డీఈఓ రాధాకిషన్ తెలిపారు. బుధవారం పరీక్షల కోసం సంబంధిత అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. పది పరీక్షలకు 459 మంది, ఇంటర్‌లో 876 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఏదైనా గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 9 నుండి 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించాలి

ఎస్పీ పరితోశ్ పంకజ్



ఝరాసంగంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ పరితోశ్ పంకజ్, చిత్రంలో ఎస్‌ఐ నరేశ్

ఝరాసంగం/న్యాల్‌కల్ (జహీరాబాద్): ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్‌లకు పాల్పడకుండా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎస్పీ పరితోశ్ పంకజ్ సూచించారు. మండల కేంద్రమైన ఝరాసంగంలోని బుధవారం పోలీస్ స్టేషన్‌తోపాటు న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ పీఎస్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణను సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...ఎలాంటి కేసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికబద్ధంగా ప్రతీ కేసును పరిష్కరించాలన్నారు. మిస్సింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నైట్ బీట్, పెట్రోలింగ్ అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సిబ్బందికి ఎస్పీ సూచించారు. సరిహద్దుల వద్ద తనిఖీలు తప్పనిసరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, రూరల్ సీఐ హన్మంతు, ఎస్ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ఇంధనం



మహిళలతో పెట్రోల్ బంకుల ఏర్పాటు
- మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహణ
- అనువైన భూముల సేకరణకు ప్రభుత్వం ఆదేశం
- సంగారెడ్డిలో పూర్తికావస్తున్న పెట్రోల్ బంక్



సంగారెడ్డిలో పూర్తి కావస్తున్న మహిళా సంఘం పెట్రోల్ బంకు

సంగారెడ్డి జోన్: మహిళల సాధికారతకు, వారు అన్ని రంగాల్లో రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధి సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. స్వయం సహాయక మహిళా సంఘాల్లోని ప్రతీ మహిళ ఆర్థికంగా స్వయం సంవృద్ధి సాధించేలా వారికి ఉపాధి కల్పన కోసం మహిళాశక్తి పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ మహిళాశక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక మహిళా సంఘాలతో పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయించి వారితోనే వాటిని నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకు సంబంధించిన పనులను వేగంగా జరుగుతున్నాయి.

నియోజకవర్గాల్లో ఏర్పాటుకు కసరత్తు

జిల్లాలోని నియోజకవర్గాల్లో మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. జిల్లాలోని 18,756 మహిళా శక్తి సంఘాల్లో 1,90,381 మహిళలు ఉండగా తొలుత సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, పటాన్‌చెరు, అందోల్–జోగిపేటలో ఏర్పాటు చేయనున్నారు. భూములను సేకరించేందుకు ఇటీవల అధికారులు ఆదేశాలను జారీ చేశారు. తొలుత ఆయా కేంద్రాలలో అనువైన భూములు గుర్తించనున్నారు. సుమారు ఎనిమిది గుంటల ప్రభుత్వ భూమి రోడ్డు పక్కన ఉండాలి. నిత్యం వాహనాల రద్దీతోపాటు ఆ చుట్టుపక్క పరిసరాల్లో మరో బంకు లేకుండా ఉండే ప్రదేశాలలో ఈ పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనున్నారు.

సంగారెడ్డిలో ఏర్పాటు

మొదటిగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో జిల్లా మహిళా సమాఖ్య ద్వారా పెట్రోల్ బంకును ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో పాత డీఆర్డీఏ కార్యాలయ ఆవరణలో 8 గుంటల భూమిని కేటాయించి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కంపెనీ (ఐఓసీఎల్) ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. బంకు ఏర్పాటుకు సుమారు రూ.2కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ఇప్పటికే పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ నెలాఖరునాటికి పనులు పూర్తి చేసి, ప్రారంభించనున్నారు.

మహిళా సమాఖ్య ద్వారా నిర్వహణ

పట్టణంలో ఏర్పాటు చేస్తున్న మహిళా పెట్రోల్ బంక్ నిర్వహణ బాధ్యతలను జిల్లా మహిళా సమాఖ్య చేపట్టనుంది. షిఫ్టుల పద్ధతిలో సుమారు 15 నుంచి 20 మంది మహిళలు విధులు నిర్వహించనున్నారు. బంకుల నిర్వహణకు ఎంపిక చేసిన సభ్యులకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 21నాటికి శిక్షణ పూర్తి కానుంది.

మహిళా సమాఖ్య సభ్యులతో...

జిల్లాలోని నియోజకవర్గాల్లో పెట్రోల్ బంకులను ఆయా నియోజకవర్గాల్లోని మండల, గ్రామ సమాఖ్య సభ్యులచేత ఏర్పాటు చేయనున్నారు. బంకులను నిర్వహించేందుకు మహిళా సంఘాల సభ్యులలో కనీసం 20నుంచి 35 సంవత్సరాలలోపు కలిగి ఉండి, పదవతరగతి, ఇంటర్, డిగ్రీ కలిగి ఉన్న వారిని ఎంపిక చేస్తున్నారు. క్యాషియర్, పెట్రోల్, డీజిల్ అమ్మే వారు పదవతరగతి, మేనేజరు పోస్టుకు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని అధికారులు నిర్ణయించారు.

ఐఓసీఎల్‌తో 20ఏళ్ల ఒప్పందం

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేసి 20 ఏళ్లపాటు నిర్వహించేందుకు ఐఓసీఎల్ ద్వారా కంపెనీ ప్రతినిధులు, జిల్లా అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. అదేవిధంగా నియోజకవర్గాల్లో కూడా ఏర్పాటు చేసే బంకులకు ఐఓసీఎల్ కంపెనీతో అధికారులు ఒప్పందం చేసుకోనున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవో నాయకులు

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్
- టీఎన్జీవో నూతన భవన నిర్మాణానికి భూమి పూజ

సంగారెడ్డి: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డులో ప్రభుత్వం టీఎన్జీఎస్ నూతన భవన నిర్మాణంకు కేటాయించిన స్థలంలో టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌లతో కలిసి బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...జిల్లాలో ఉన్నటువంటి ఉద్యోగులకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటామన్నారు. అలాగే భవన నిర్మాణానికి తమవంతుగా కృషి చేస్తామని, కలెక్టర్ ఉద్యోగుల పక్షానే ఉంటారని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. టీఎన్జీవోస్‌కు స్థలం కేటాయించినందుకు ప్రభుత్వానికి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖకు టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండి జావేద్ అలీ, సంఘం జిల్లా కార్యదర్శి వి.రవి, అసోసియేట్ అధ్యక్షుడు కసిని శ్రీకాంత్, పి.వెంకట్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ జిల్లా లోని ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

హైనా దాడిలో గొర్రెలు మృత్యువాత


మృత్యువాత పడిన గొర్రెలు

మద్దూరు(హుస్నాబాద్): హైనా దాడిలో గొర్రెలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని రేబర్తి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఈరి శ్రీనివాస్ తన వ్యవసాయ బావి వద్ద షెడ్డు నిర్మించుకొని గొర్రెల పెంపకం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే గొర్రెలను షెడ్డులోకి తోలి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం షెడ్డు వద్దకు వెళ్లి చూడగా హైనా దాడిలో ఏడు గొర్రెలు మృతి చెంది కనిపించాయి. మరో మూడు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. సుమారు రూ.లక్ష వరకు నష్ట వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

తండ్రిపై హత్యాయత్నం

- కుమారుడు రిమాండ్

నర్సాపూర్ : తండ్రిపై హత్యాయత్నం చేసిన కుమారుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ లింగం తెలిపారు. మండలంలోని చిన్నచింతకుంటకు చెందిన వడ్ల నాగరాజు తన తండ్రి దశరథను ఎలాగైనా చంపాలన్న ఉద్దేశ్యంతో 12న నర్సాపూర్‌లో కత్తి కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి తండ్రితో గొడవ పడి కత్తితో దాడి చేశాడు. ఆస్తి పంచడం లేదని, తనకు మరో పెళ్లి చేయడం లేదన్న నెపంతో కత్తితో తండ్రిపై దాడి చేశాడని పేర్కొన్నారు. బుధవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

దాడి కేసులో ఇద్దరు అరెస్ట్

నంగునూరు(సిద్దిపేట): రెండు వేర్వేరు చోట్ల దాడికి పాల్పడిన ఘటనలో ఇద్దరిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించనట్లు రాజగోపాల్‌పేట ఎస్ఐ అసీఫ్ తెలిపారు. నర్మేటకు చెందిన సాయికుమార్ మంగళవారం పుట్టిన రోజు జరుపుకుంటుండగా అదే గ్రామానికి చెందిన రాజశేఖర్ మద్యం తాగించాలని కోరాడు. డబ్బులు లేవని చెప్పడంతో దాడి చేయగా సాయికుమార్‌కు గాయాలయ్యాయి. అలాగే, మంగళవారం హుస్నాబాద్‌లో జరిగిన పెళ్లి వేడుకల్లో జరిగిన గొడవ విషయమై మాట్లాడుతుండగా నంగునూరుకు చెందిన జిడ్డి రజినీకాంత్, సంపత్‌లపై ముండ్రాయికి చెందిన జున్నుబోయిన అనిల్ దాడి చేశాడు. రెండు ఘటనలపై బాధితుల ఫిర్యాదు మేరకు ఇద్దరిని బుధవారం రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

అంబేడ్కర్‌ను రాజకీయాలతో ముడిపెట్టొద్దు

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య



దుబ్బాక : భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను స్వార్థ రాజకీయాలకు ముడి పెట్టడడం బాధాకరమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 13న దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమాన్ని రాజకీయాలకు ముడి పెట్టడడం తగదన్నారు. ముబారస్‌పూర్‌లో జరిగిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నాతోపాటు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, డీబీఎఫ్ జాతీయ నాయకులు శంకర్ అక్కడే ఉన్నామని కింద ఉన్న వ్యక్తి జెండా కావాలని అడుగడంతో ఎమ్మెల్యేపై నుంచి జెండాను ఆ వ్యక్తికి వేశాడని అన్నారు. అనవసరంగా దీనిపై రాజకీయాలు చేయడం మంచి పరిణామం కాదన్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి జెండాను కింద పడేస్తే మేమే ఖండించేవారిమని దీనిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు.

తల్లీకొడుకులమృతిపై కేసు నమోదు

కల్హేర్(నారాయణఖేడ్): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి తల్లీకొడుకులు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కల్హేర్ ఎస్ఐ వెంకటేశం బుధవారం తెలిపారు. నిజాంపేట మండలం బాచేపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రేగోడ్ మండలం పట్టిపాలం తండాకు చెందిన తల్లీకొడుకులు లావుడ్య సక్రిబాయి, సుభాష్ దుర్మరణం చెందారు. మృతురాలు సక్రిబాయి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రమాదానికి గల వాహనాన్ని గుర్తించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.



ఈ ఫొటోలో కనిపిస్తుంది దుబ్బాకకు చెందిన కౌలు రైతు మల్లారెడ్డి. యాసంగిలో వేసిన 3 ఎకరాల వరి పంట ఇంకో 15 రోజులైతే కోతకొచ్చేది. ఆకాశంలో మబ్బులు అవుతుండటంతో భయంతో వరి గొలుసు ఎర్రబడక ముందే కోయించాడు. వర్షం పడితే ఇత్తు చేతికి రాదు ఉన్న పంటనన్నా చేతికొస్తే చాలనుకొని పచ్చిగా ఉన్నా వరిని కోశాడు. ఇది ఈ ఒక్క రైతు మల్లారెడ్డిదే పరిస్థితే కాదు.. జిల్లాలోని చాలా మంది రైతులది ఇదే పరిస్థితి. మొగులు గుబులుతో నష్టం అయినా సరే పంటనన్నా కాపాడుకోవాలనే పచ్చి వరిని కోయిస్తున్నారు.



మొగులు.. గుబులు

రైతులను భయపెడుతున్న మబ్బులు

- వర్షం పడితే వరి పంట ఆగమాగమే
- నష్టమని తెలిసినా.. ముందే కోయిస్తున్న వైనం
- ఉన్న పంటనన్నా చేతికొస్తే చాలంటున్న రైతులు
- పచ్చి వరి చేను కోతతో 20 శాతంకు పైగా నష్టం
- జిల్లాలో 3.53 లక్షల ఎకరాల్లో వరి సాగు

దుబ్బాక : ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్న వేళ రైతుల గుండెల్లో గుబులు పుడుతుంది. ఏ క్షణాన గాలి దుమారం వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం రెక్కలు ముక్కలు జేసుకొని.. పుట్టెడు పెట్టుబడులు పెట్టి కండ్లళ్ల ఒత్తులు వేసుకొని యాసంగిలో పంటలు కాపాడుకుంటూ వస్తున్న రైతులకు వాన మొగులు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. వరి పంటలు చేతికొచ్చే దశలో వారం రోజులుగా ఆకాశంలో మబ్బులు రైతులను పరేషాన్ చేస్తున్నాయి. 20 రోజుల కిందట వడగండ్ల వానలు పడటంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మళ్లీ గాలి దుమారం, వడగండ్ల వానలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలతోపాటు వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు పచ్చి వరి పంట చేలనే కోస్తున్నారు.

20 శాతంకు పైగా నష్టమైనా..

వర్షాలు పడే సూచనలు ఉండడంతోపాటు వారం రోజులుగా చినుకులు కూడా పడుతుండటంతో రైతులు భయంతో 70 శాతం కూడా పూర్తి కాని వరి పంటలను కోయించుకుంటున్నారు. భూమి ఆరక దిగబడుతుండటంతో ఖర్చు ఎక్కువైనా చైన్ మిషన్లను పెట్టి కోయిస్తున్నారు. సుమారుగా 20 శాతంకు పైగా గింజలు తాలుపోయి నష్టం జరిగే అవకాశాలు ఉంది. జిల్లాలో ఈ యాసంగిలో 3.53 లక్షల ఎకరాల్లో వరి పంటలు వేయగా చాలా వరకు నీరందక పంటలు ఎండిపోయాయి. గతంలో కురిసిన వడగండ్ల వర్షంతో కొంత వరి పంటలకు నష్టం వాటిల్లింది. తీరా మళ్లీ ఆకాశంలో మార్పులతో పూర్తిగా కాని చేలనే కోస్తుండటంతో చాలా నష్టం వాటిల్లేటట్లు కనిపిస్తుంది.


దుబ్బాకలో పచ్చి వరిని కోయిస్తున్న రైతు

10 రోజులకు కోసేదుండే..



నేను 4 ఎకరాల్లో వరి పంట వేసిన. ఇంకో 10 నుంచి 15 రోజులైతే వరి పూర్తిగా కోతకు వచ్చేది. వాన భయంతో ముందుగానే కోయించిన. కొంత పాల్లు పోయినా వాన పడితే ఇత్తు చేతికి రాదనే భయంతోనే కోయించిన. ఏం చేస్తాం బాకీ ఉన్న కాడికి అయితాయి. ఇంకా 10 రోజులు ఉంచితే చేతికొస్తదనే గ్యారంటీ లేదాయే. నేనే కాదు చాలా మంది పచ్చి చేలనే కోయిస్తుండ్రు.
– గన్ని వెంకట్రాజిరెడ్డి, రైతు దుబ్బాక

వానపడితే చేతికిరాదనే భయం..



20 రోజుల కిందటే వరి ఈనుతున్న దశలోనే వడగండ్ల వర్షం పడింది. మళ్లీ చేతికొస్తదనుకున్న సమయంలో మొగుల్లు కావట్టే. మళ్లీ రాళ్ల పడితే పంటగింజ కూడా దక్కదు. పచ్చిగా ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో కోయించిన. యాసంగిలో పంట చేతికొచ్చేది నమ్మకం లేదు. పోయిన యాసంగిలో రాళ్లవాన పడి పంట చాలా నష్టం జరిగింది. ఇప్పుడు మొగుల్లు అవుతుండటంతో 2 రోజుల కిందటనే పచ్చిచేనునే కోయించినా.
– ఎంగారి నరేశ్ రెడ్డి, రైతు

ఎర్రబడక ముందే కోస్తే నష్టం



వరి పంటలు పూర్తిగా ఎర్రబడక ముందే కోయడం వల్ల నష్టం వాటిల్లుతుంది. వరి గొలుసులు 85 నుంచి 90 శాతం వరకు ఎర్రబడ్డ తర్వాతనే పంటలు కోస్తే దిగుబడి మంచిగా వస్తుంది. వానల భయంతో రైతులు పూర్తిగా గొలుసు కాకముందే కోస్తుండడం వల్ల చాలా వరకు గింజలు తాలు పోయే పరిస్థితి ఉంటుంది. రైతులు పూర్తిగా గొలుసు ఎర్రబడక ముందే పంటలు కోసి నష్టపోవద్దు.
– రాధిక, జిల్లా వ్యవసాయాధికారి

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

- వెంచర్లలో అల్యూమినియంతోపాటు ఎలక్ట్రికల్ వైర్లు చోరీ
- 9 మందితో కూడిన ముఠా అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ పరితోష్ పంకజ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్, తదితరులు

సంగారెడ్డి జోన్: వెంచర్లలో అల్యూమినియంతో పాటు ఎలక్ట్రికల్ వైర్ల దొంగతనానికి పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. ఒరిస్సా, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ముఖేష్ పర్రిదా, రవిరంజ న్‌కుమార్, సాగర్ పవార్, దినేశ్ కుమార్, రంజయ్‌కుమార్ రామ్, అమిత్ పాండే, వినయ్‌కుమార్ రామ్, శైలేష్, రవిశంకర్‌తో పాటు మరి కొందరు కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. వివిధ పనులు చేసుకుంటూ ఉండగా జల్సాలకు అలవాటు పడ్డారు. వచ్చే డబ్బులు సరిపోక తప్పుడు మార్గంలో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. గతంలో వెంచర్లలో దొంగతనాలు చేసిన ఒరిస్సాకు చెందిన హరితో వీరికి పరిచయం ఏర్పడింది. హైదరాబాద్ సమీప ప్రాంతాల్లోని వెంచర్లలో అల్యూమినియంతోపాటు ఎలక్ట్రికల్ వైర్లు దొంగతనం చేసి అమ్మగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసుకునేవారు.

సదాశివపేట దొంగతనంతో గుట్టురట్టు

సదాశివపేట మండల పరిధిలోని అంకెనపల్లి గ్రామంలోని ఓ వెంచర్‌లో సుమారు 6000 మీటర్ల ఎలక్ట్రికల్ వైర్లను దొంగతనం చేశారు. వెంచర్ నిర్వాహకుడు సంతోష్‌కుమార్ 1న సదాశివపేటలో ఫిర్యాదు చేశాడు. సదాశివపేట, సీసీఎస్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి టెక్నాలజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. బుధవారం తెల్లవారుజామున మద్దికుంట చౌరస్తాలో దొంగతనానికి పాల్పడుతుండగా పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.2 లక్షల విలువ గల 778 కిలోల అల్యూమినియం ఎలక్ట్రికల్ వైర్‌ను, ట్రాలీ ఆటో, వైర్ కట్ చేయడానికి ఉపయోగించిన కట్టర్స్ లను స్వాధీన చేసుకున్నారు. 9 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా హరితోపాటు రాజ్ కిషోర్ సాహూ, మానస్ కుమార్, బీహార్ నిర్మల్ సింగ్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ వివరించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్, సీసీఎస్ సీఐ వీ.శివకుమార్, పీ. రాము నాయుడు, ఎస్ఐ కె.శ్రీకాంత్, ఇన్వెస్టిగేషన్ అధికారి నగేశ్‌తో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

జానపదంతో ఆత్మవిశ్వాసం

- ముగింపు సదస్సులో వక్తలు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో జానపద సాహిత్యం పునఃమూల్యాంకనం అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాల జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ ఆచార్యులు డప్పు కనకయ్య, రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ నలిమెల భాస్కర్, రిటైర్డ్ ప్రొఫెసర్ మాదిరెడ్డి అండమ్మ, పాఠ్యప్రణాళిక అధ్యక్షుడు ఏలె విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి, సదస్సు కన్వీనర్, తెలుగుశాఖాధిపతి డాక్టర్ మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. జానపదం మానవాళిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. ఇతర భాషల్లోని జానపద అంశాలు, సామెతలు, ఆచార వ్యవహారాలను గురించి విద్యార్థులకు వివరించారు. రెండ్రోజుల సదస్సులో వివిధ కళాశాలలు, యూనివర్సిటీల నుంచి ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, స్నాతక, స్నాతకోత్తర విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలపై 110 పత్రాలను సమర్పించినట్లు తెలుగు అధ్యాపకులు పిట్లదాసు ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల సీఓఈ డాక్టర్ గోపాల సుదర్శనం, అధ్యాపకులు డాక్టర్ అనురాధ, డాక్టర్ ఉమామహేశ్వరి, డా.లీలావతి, డా.ఖలీమొద్దీన్, తెలుగు విభాగం అధ్యాపకులు నారోజు వెంకటరమణ, చక్రహరిరమణ, సంపత్, రామస్వామి, నరేశ్, శైలజ, నర్సింలు, సాయి సురేశ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన వంగడాలపై పరిశోధనలు చేయాలి

- లక్నో చెరకు పరిశోధనా కేంద్రం డైరెక్టర్ కె.విశ్వనాథ్
- ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో ఒక రోజు సెమినార్

న్యాల్‌కల్(జహీరాబాద్): అధిక దిగుబడులు వచ్చే నూతన వంగడాలపై పరిశోధనలు చేయాలని లక్నో చెరకు పరిశోధనా కేంద్రం డైరెక్టర్ కె.విశ్వనాథ్ శాస్త్రవేత్తలను కోరారు. బుధవారం న్యాల్‌కల్ మండల పరిధిలోని బసంత్‌పూర్–మామిడ్గి గ్రామాల శివారులో గల ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో ఒక రోజు సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి శాస్త్రవేత్తలు, వివిధ రాష్ట్రాలకు చెందిన చక్కెర ఫ్యాక్టరీల ప్రతినిధులు హాజరయ్యారు. పరిశోధనా కేంద్రంలోని పలు రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ.. అధిక దిగుబడులు ఇచ్చే కొత్త రకం చెరకు వంగడాలను కనుక్కోవడం ద్వారా అధిక దిగుడులు పొంది రైతులు మంచి లాభాలు పొందవచ్చన్నారు. చెరకు పంట సాగులో దిగుబడులు, చీడ పీడల నివారణ, నీటి యాజమాన్య పద్ధతులు, అంతర పంటల సాగు తదితర అంశాలను గురించి రైతులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని ఆయన కోరారు. శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. చెరకు పంట సాగు, దిగుబడులు, చీడ పీడల నివారణ తదితర అంశాలపై రైతులకు ఎప్పటికప్పుడూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం 8005 రకం చెరకు పంటలో కాటిక తెగుళ్ల సోకాయన్నారు. వాటి నివారణ కోసం తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ విజయలక్ష్మి, తబుసుమ్ ఫాతిమా, సంగారెడ్డి సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, అసిస్టెంట్ కేన్ కమిషనర్ రాజశేఖర్, చక్కెర కర్మాగారాల ప్రతినిధులు పాల్గొన్నారు.


సెమినార్‌లో శాస్త్రవేత్తలు, చెరకు పరిశోధనా కేంద్రం డైరెక్టర్ విశ్వనాథం, తదితరులు

క్యాన్సర్ అంటే భయం వద్దు

- సకాలంలో గుర్తిస్తే ఆదిలోనే జయించే అవకాశం
- మున్సిపల్ చైర్మన్ మంజుల
- సిద్దిపేటలో 19న ఉచిత వైద్య శిబిరం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ మంజుల, డాక్టర్లు, నాయకులు

సిద్దిపేటజోన్: క్యాన్సర్ అంటే ప్రజల్లో ఒక భయం ఉందని, అలా భయపడొద్దని ప్రాథమిక దశలో గుర్తించి సరైన వైద్యం అందిస్తే జయించే అవకాశం ఉందని మున్సిపల్ చైర్మన్ మంజుల, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వేణుగోపాల్ రెడ్డి, సాయిరాంలు పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కిమ్స్ ఆస్పత్రికి చెందిన ప్రముఖ అంకాలజిస్ట్ వైద్యులు డాక్టర్ మధు, డాక్టర్ శ్రవణ్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిద్దిపేట నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రత్యేక చొరవతో కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంగా ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 19న స్థానిక విపంచి ఆడిటోరియంలో ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో మమోగ్రఫీ, పాప్ స్మియర్, బోత్‌బ్రెస్ట్ అల్ట్రా సౌండ్, ఎక్స్‌రే, ఎండోస్కోపీ, అల్ట్రా సౌండ్ తదితర పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఈర్షద్, వర్మ, రాములు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : యువకుడు మృతి


లింగాల భాను(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి ఘటన అక్కన్నపేట మండలం పోతారం(జే) గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన లింగాల భాను(23) వ్యవసాయ పనుల నిమిత్తం తన మామయ్య లింగాల యాదయ్య దగ్గర నుంచి ట్రాక్టర్ తీసుకెళ్లాడు. పనులు పూర్తి చేసిన అనంతరం తెల్లవారుజామున తీసుకొస్తుండగా గ్రామ శివారులో కల్వర్టు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో భాను ట్రాక్టర్ ఇంజన్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. జేసీబీ సాయంతో ట్రాక్టర్‌ను తొలగించి మృతదేహాన్ని బయటకు తీశారు. అందరితో కలివిడిగా ఉండే యువకుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బైక్ ఢీకొని వ్యక్తి

టేక్మాల్ (మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన టేక్మాల్ మండల పరిధిలోని లక్ష్మణ్ తండాలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ దయానంద్ కథనం మేరకు.. జోగిపేట– లక్ష్మీనగర్ రోడ్డుపై 14న తండాకు చెందిన కాట్రోత్ పోమ్లా నాయక్ (55) వడ్లు ఆరబోస్తుండగా అతివేగంగా బైక్ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు అయ్యాయి. 108 సాయంతో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తమ్ముడు బిక్యానాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వైన్స్‌లోని పర్మిట్ రూమ్‌లో యువకుడు


యాదుల్ (ఫైల్)

జోగిపేట(అందోల్): వైన్స్‌లోని పర్మిట్ రూమ్‌లో యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ పాండు కథనం మేరకు.. జోగిపేట పట్టణానికి చెందిన యాదుల్ (45) చౌరస్తాలోని టీ స్టాల్‌లో పనిచేస్తుంటాడు. బుధవారం మద్యం సేవించేందుకు మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న పద్మావతి వైన్స్‌కు వెళ్లాడు. అతిగా మద్యం సేవించి కూర్చున్నచోటే కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ పాండు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఫర్వీన్ బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వడదెబ్బ లక్షణాలతో వృద్ధుడు?


బాలయ్య (ఫైల్)

రామాయంపేట(మెదక్): వడదెబ్బ లక్షణాలతో వృద్ధుడు మృతి చెందిన ఘటన రామాయంపేట పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన ఎరుకల బాలయ్య(68) ప్రతిరోజూ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు రోజులుగా అస్వస్థతకు గురై పనికి వెళ్లకుండా ఇంటివద్దే ఉంటున్నాడు. మంగళవారం రాత్రి వాంతులు చేసుకున్న బాలయ్యను ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. తన భర్త వడదెబ్బతోనే మృతి చెందినట్లు మృతుని భార్య తెలిపింది. సమాచారం అందుకుని వైద్యశాఖ అధికారులు మృతుడి ఇంటికెళ్లి వివరాలు సేకరించారు. వడదెబ్బతో మృతి చెందలేదని, అలాంటి లక్షణాలు లేవని పేర్కొన్నారు.

ఉచిత కరెంట్‌తో ఇటుక బట్టీలు

ట్రాన్స్‌కో ఆదాయానికి భారీగా గండి

- వ్యవసాయ బావుల నుంచి అక్రమంగా తీసుకుంటున్న నిర్వాహకులు
- ప్రభుత్వ భూముల్లో నుంచి మట్టి తవ్వకం
- చోద్యం చూస్తున్న అధికారులు

తూప్రాన్: రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కరెంట్ అక్రమ ఇటుకల వ్యాపారులకు వరంగా మారింది. పంటల సాగు కోసం వినియోగించాల్సిన ఉచిత విద్యుత్‌ను తమ వ్యాపారానికి వినియోగిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. ఇటుకల తయారీ కోసం అవసరమయ్యే నీటి కోసం విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఓ పక్కా రైతులు వేసిన పంటలకు విద్యుత్ సరఫరా సక్రమంగా అందించలేక, లో వోల్టేజీ కారణంగా బోరుమోటార్లు కాలిపోతున్నాయి. ఫలితంగా రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. అక్రమ విద్యుత్ కనెక్షన్లను అరికట్టినట్లైతే విద్యుత్ సరఫరా మారింత మెరుగుపడనుందని పలువురు రైతులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా ట్రాన్స్‌కో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఉమ్మడి మండలంలో 16 బట్టీలు

ఉమ్మడి మండలంలో తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో తదితర గ్రామల్లో కొంతమంది ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నారు. నిత్యం లారీలు, ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు సరఫరా తరలిస్తున్నారు. వ్యవసాయ పొలాల్లోని ఉచిత కరెంటు వినియోగిస్తూ జోరుగా ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. వేసవి కాలం కావడంతో ప్రజలు నూతన ఇళ్ల నిర్మాణాలను అధికంగా చేపడుతున్నారు. దీంతో ఇటుకల అవసరం అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో జోరుగా ఇటుక బట్టీలు వెలుస్తున్నాయి. సుమారు ఉమ్మడి మండలంలో 16 బట్టీలకు పైగా మండలంలో కొనసాగుతున్నాయి. వీటికి నిర్వాహకులు ఉచిత కరెంట్‌ను వినియోగిస్తున్నారు. బావుల దగ్గర నడవని మోటార్ల నుంచి కరెంట్ తీసుకొని వాడుకుంటున్నారు.వ్యాపారులు ఇటుక బట్టీలకు తప్పనిసరిగా కమర్షియల్ విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలి. కానీ ఎలాంటిది ఏదీ తీసుకోవడం లేదు. దీంతో రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ విషయం ట్రాన్స్‌కో అధికారులకు తెలిసినా నామ మాత్రంగా కేసులు పెట్టి చేతులు దులుపుకుంటూ... పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకం

ఇటుకల తయారీకి అవసరమైన మట్టిని ప్రభుత్వ భూముల్లోంచి లారీలు, ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారు జామువరకు ముడి సరుకును గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఇలా ప్రభుత్వ భూముల్లో, చెరువులు, కుంటలు ఎక్కడబడితే అక్కడ వీరి అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట లేకుండా పోతుంది. ఇప్పటికైనా పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై దృష్టి సారించి వ్యాపారులను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


తూప్రాన్ మండలంలో ప్రభుత్వ భూమిలో ఇటుక బట్టీ

చర్యలు తీసుకుంటాం



ఇటుక బట్టీలకు ఉచిత విద్యుత్‌ను వినియోగిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కొందరిపై కేసులు నమోదు చేశాం. వ్యాపారులు ఇటుక బట్టీలకు తప్పనిసరిగా కమర్షియల్ విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలి. లేని పక్షంలో వారిని గుర్తించి చట్టరీత్యా కేసులు నమోదు చేస్తాం.
– వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఏఈ, తూప్రాన్